




# కరపత్రం

SINCE 2014

ఆదివారం నవంబర్ 24 2024 | సంపుటి :0 | సంచిక : 46 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# రైతు సదస్సు మూడు రోజులపాటు నిర్వహించండి: సీఎం రేవంత్



- ప్రజా ప్రభుత్వ విజయోత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్‌లో నవంబర్ 30న జరగనున్న రైతు సదస్సులో రాష్ట్రంలోని రైతులంతా పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.
- ఈ సభను బహిరంగ సభలా కాకుండా.. రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమంలా నిర్వహించాలని సూచించారు.
- శనివారం ఆయన వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహించారు. రైతు సదస్సుపై ప్రధానంగా చర్చించారు.

వ్యవసాయంలో వచ్చిన అధునాతన సాగు పద్ధతులు, మెలకువలను రైతులకు తెలియజేసేలా వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన కొత్త వంగడాలు, ఆయిల్ పామ్ కంపెనీల నూతన ఆవిష్కరణలు, వివిధ కంపెనీల వినూత్న ఉత్పత్తులన్నీ స్టాళ్లల్లో ఉంచాలని సీఎం సూచించారు. అధునాతన పరికరాలు, ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, డ్రోన్లు అన్నింటినీ ప్రయోగాత్మక ప్రదర్శనకు సిద్ధంగా ఉంచాలన్నారు.

రైతులు అప్పటికప్పుడు వచ్చి వెళ్లేలా కాకుండా, వారికి అవగాహన కల్పించేలా మూడు రోజుల పాటు సదస్సు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. 28వ తేదీ నుంచే ఈ స్టాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. దీంతో రాష్ట్రంలోని రైతులు దేశంలో వ్యవసాయ సాగు విధానాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా

### కొనసాగుతోన్న కులగణన సర్వే



జనగాం, ములుగు జిల్లాలలో వంద శాతం సర్వే పూర్తి

2 లో

## జానీ మాస్టర్ బెయిల్ రద్దు పిటిషన్‌ను కొట్టివేత



లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ అయిన కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారన్న విషయం తెలిసిందే.

2 లో

## హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రిలో పసికందు కిడ్నాప్



హైదరాబాద్: నగరంలోని నీలోఫర్ ఆస్పత్రిలో నెలల వయసున్న పసికందును గుర్తు తెలియని మహిళ కిడ్నాప్ చేసింది. జహీరాబాద్‌కు చెందిన హసీనా బేగం, గఫర్ దంపతులకు బాబు జన్మించాడు. పసికందుకు జాండీస్ రావడంతో చికిత్స నిమిత్తం నీలోఫర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో చికిత్స పేరుతో ఆస్పత్రి సిబ్బంది అని చెప్పిన గుర్తుతెలియని మహిళ.. చిన్నారిని తీసుకెళ్లింది. ఎంతసేపటికీ బాబును తీసుకురాకపోవడంతో ఆస్పత్రి మొత్తం వెతికినా బాబు, ఆ మహిళ కనిపించలేదు. అనుమానం వచ్చిన తల్లి హసీనా వెంటనే నాంపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆస్పత్రిలో భద్రతా వైఫల్యం కారణంగానే కిడ్నాప్ చేశారని బాధిత తల్లి ఆరోపిస్తున్నారు.

## ప్రజలంతా ప్రధాని మోడీ వెంటే

- సిఎం ఎవరన్నది కూటమి నిర్ణయిస్తుంది
- ఫలితాలపై మాజీ సిఎం ఫడ్ణవీస్ స్పందన

2 లో



## వ్యూహాత్మకంగా బిజెపి ఎత్తులు

2 లో

- ఓబిసి ఓట్ల సమీకరణలో విజయం
- మహిళలను ఆకట్టుకోవడంలోనూ పైచేయి
- మహాయుతి విజయంలో వీరే కీలకం

## రేవంత్ అసత్య ప్రచారాన్ని మరాఠా ప్రజలు నమ్మలేదు: కేటీఆర్

- దేశ భవిష్యత్‌కు ప్రాంతీయ పార్టీలే బలమైన పునాదులనే విషయం మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఫలితాలతో తేలిపోయిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు.



మిగతాది 2లో

## కాంగ్రెస్ మరోసారి నవ్వులపాలైంది: కిషన్ రెడ్డి

హైదరాబాద్: దేశ ప్రజల ముందు కాంగ్రెస్ మరోసారి నవ్వుల పాలైందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మహారాష్ట్ర ప్రజలు భాజపాకు చక్కటి మెజార్టీ కట్టబెట్టారన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

"రాహుల్‌గాంధీ మహారాష్ట్రలో విద్వేష ప్రచారం చేశారు. కులం, మతం పేరుతో ప్రజలను విడగొట్టాలని చూశారు. కానీ, ఇండియా కూటమికి మహారాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. ఈ విజయంతో భాజపా మహారాష్ట్రలో హ్యాట్రిక్ కొట్టింది. గత ఎన్నికల్లో ప్రజా తీర్పును ఉద్దవ్ ఠాక్రే వంచించారు. అనేక రాష్ట్రాల్లో రెండోసారి అధికారంలోకి వచ్చాం. కాంగ్రెస్ 3 రాష్ట్రాలకే పరిమితమైంది" అని అన్నారు.



## హైదరాబాద్‌లో డిసెంబర్ 8 నుంచి 'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో డిసెంబర్ 8 నుంచి 16వ తేదీ వరకు 'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఉంటుందని ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులు తెలిపారు.



మిగతాది 2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం నవంబర్ 24 2024

# సంపాదకీయం

## కులం సంపూర్ణం.. ఆర్థికం అర్ధసత్యం.. తేలేది అదేనా?

కులం నిజం! ఆర్థికం అర్ధసత్యం! తెలంగాణ సామాజిక, ఆర్థిక, రాజకీయ, కులగణన సర్వే అందించనున్న దృశ్యం గురించి ఇందుకు భిన్నంగా సూత్రీకరించలేం! కులం గురించి చెప్పటానికి ఇష్టపడని వారూ సర్వేలో ఎదురుపడ్డారు. కులగణనతో ప్రయోజనం లేదని తలచినవారూ అందులో పాల్గొనటానికి ససేమిరా అన్నారు. సర్వే ముందుకెళ్లిన కొద్దీ ఈ ఇరు వర్గాల సంఖ్యా గణనీయంగా పెరగలేదు. సర్వేలో ఏదో విధంగా పాల్గొన్న వారి సంఖ్యే ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. ఇక అనుకున్నట్లుగా సర్వే ముగిసి లెక్కలు కొలిక్కి వస్తే అటుఇటుగా కులాల సంఖ్యాబలం తేలిపోతుంది. ఆమేరకు సర్వే సఫలం అనుకోవచ్చు! ఈ సఫలత వెనుక ఒక ప్రగాఢ విఫలత కూడా కాచుకుని ఉంది. అది సృష్టించే ఇబ్బందులే ప్రధానమైనవి. ఆర్థిక స్థితిగతులకు సంబంధించి లభించే అసమగ్ర చిత్రమే ఆ విఫలతగా భావించొచ్చు. అనుకున్న లక్ష్యాన్ని సర్వే చేరుకోకుండా నిలిపివేసేది ఆ అసమగ్ర చిత్రమే!

అర్థిక స్థితిగతులకు సంబంధించిన అసమగ్ర సమాచారంతోనే అసలు చిక్కంతా ఉంది. ఆ సమాచారంతో వివిధ వర్గాల, కులాల నిజ స్థాయిని సరిగా అంచనా వేయలేం. ఒక కులంలో ఆర్థిక అంతరాలను సమగ్రంగా లెక్కించలేని సర్వేతో చాలా విలువైన సమాచారం లభించని పరిస్థితే నెలకొంటుంది. వివిధ రూపాల్లో ఉన్న ఆస్తులు, సంపద గురించి నిజాయితీగా చెప్పే వారి సంఖ్య అంత ఆశాజనకంగా లేదనే సమాచారం క్షేత్రస్థాయి నుంచి అందుతోంది. సర్వే ఆరంభమైన మొదటిరోజు నుంచీ ఆస్తులు, సంపద గురించి విపులంగా చెప్పటానికి విముఖతను వ్యక్తం చేసిన వారు గణనీయంగానే ఉన్నారు. ఈ విముఖత మధ్యతరగతి, ధనికుల్లోనే గాక పెద్దగా ఆస్తుల్లేని వర్గాల నుంచి కూడా వ్యక్తమవుతోంది. ఆస్తులు చెప్పినవారు కూడా మొత్తం సమాచారం ఇచ్చారని భావించలేం. నాలుగు ఆస్తులు ఉంటే ఒకటి రెండు ఆస్తులు చెప్పి సరిపెట్టిన వాళ్లు ఎందరో ఉన్నారు. అంతెందుకు.. వ్యక్తిగత వాహనాల గురించి కూడా సరైన చిత్రం వస్తుందని విశ్వసించలేం. సర్వేలో ప్రజలు వెల్లడించిన వాహనాల సంఖ్యతో రవాణాశాఖ దగ్గర ఉన్న సమాచారంతో పోల్చి చూస్తే పరిమితులేమిటో తెలుస్తాయి. అస్తుబిస్తు ఆస్తులు ఉండి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను అందుకుంటున్న వారు కూడా చాలా చోట్ల సరైన సమాచారం చెప్పిన దాఖలాలు కనపడటం లేదు. ఆస్తులు ఉన్నవి ఉన్నట్లుగా చెబితే పథకాలు అందవన్న భయమూ వ్యక్తమైంది. భూ ఆస్తులకు సంబంధించి సరైన సమాచారం అందిస్తే రెవెన్యూ, రిజిస్ట్రేషన్ రికార్డులతో అది నూటికి నూరుపాళ్లు సరిపోవాలి. పట్టణాలు, నగరాల్లో అది ఎలాగూ జరగని పని! కనీసం గ్రామాల్లోని ఆస్తులకు సంబంధించైనా అట్లా సరిపోయే సమాచారాన్ని ప్రజలు ఇచ్చి ఉంటే ఒక అద్భుతంగా చెప్పుకోవచ్చు.

తెలంగాణలోనే కాదు దేశంలో ఎక్కడ సర్వే చేపట్టినా ఇదే పరిస్థితి ఉంటుంది. ఆస్తుల గురించి ప్రభుత్వాలు అడిగినప్పుడు ప్రజల స్పందన ఇలా ఉండటానికి బలమైన కారణం ఉంది. ఏ చట్టాన్నీ నిజాయితీగా అమలుచేయలేని ప్రభుత్వాలపై ప్రజల అంతరాంతాల్లో అపనమ్మకం గూడుకట్టుకుని ఉంటుంది. ఈ వైఖరి వలసపాలన కాలం నుంచి కొనసాగుతోంది. అధిక శిస్తులు, పన్నులతో ప్రభుత్వాలు ప్రజల్ని పీడించిన చరిత్ర కూడా దీనికి కారణమనే చెప్పాలి. చట్టాలను అతి సంక్లిష్టంగా రూపొందించి అర్థం కాకుండా ప్రజలను హడలెత్తించటంలో మనకెవరూ సాటిరారు. పోనీ చేసిన ఆ చట్టాలను నిక్కచ్చిగా అమలుపరచామా? అంటే అదీ లేదు. చట్టాల అమలు సాఫల్యతా రేటులో మనకు గొప్ప చరిత్ర లేదు. ఈ విషయంలో పాస్‌మార్కులు కూడా మనకు పడవు. భూసంస్కరణలు, వరకట్న నిషేధం, కులవివక్ష, పర్యావరణ పరిరక్షణ, భవన నిర్మాణ అనుమతులు లాంటి అందరికీ తెలిసిన విషయాలపై చట్టాలను తీసుకున్నా ఇదే పరిస్థితి కనపడుతుంది. చట్టాల్లో కఠినత, అమల్లో అసమర్థత.. ఇదే మన అసలైన చరిత్ర! దీన్ని దృష్టిలో ఉంచుకునే ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత గనర్ మిర్డాల్.. భారత్‌లోని ప్రభుత్వ వ్యవస్థను దృఢమైన ఆచరణకు పూనుకోని మెతక రాజ్యం (సాఫ్ట్ స్టేట్)గా వ్యాఖ్యానించారు. ఆస్తుల విషయంలో గోప్యతను పాటించటం మన సంస్కృతిలో భాగమైపోయింది. ఇరుగు దిష్టి.. పొరుగు దిష్టి పేరుతో దాచిపెట్టటం కూడా మనకు అలవాటే. ఇంటి చుట్టూ కన్నుకుట్టే వాళ్లుంటారనే నమ్మకం హిందూ ఆలోచనా విధానంలో సర్వసాధారణమని ప్రముఖ రచయిత నీరద్ సి చౌదరి 45 ఏళ్ల క్రితం చాలా చక్కగా చెప్పారు.

కులాల లెక్కలను అధికారికంగా తేల్చాలన్న డిమాండు బీసీ వర్గాల నుంచి వచ్చింది. దీని లక్ష్యం ఒక్కటే. బీసీల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు ఉండాలి. వాటిని సాధించాలంటే కులాల లెక్కలు తేలాలి. 1960ల్లోనే రాంమనోహర్ లోహియా 'మేం 60.. మాకు 60' (60 శాతం జనాభా... 60 శాతం రిజర్వేషన్లు) అనే నినాదం ఇచ్చారు. అగ్రకులాల ఆధిపత్యంతో నిండిన కాంగ్రెస్ రాజకీయాలను ఎదుర్కొని బీసీలను సంఘటితపరచటానికి లోహియా పదునుపెట్టిన మార్గమది. ఆ మార్గం ఎన్నో ఎగుడుదిగుడులు చూసినప్పటికీ 1990ల నాటికి మండల్ రాజకీయాల రూపుతీసుకుని కాంగ్రెస్‌ను హిందీ రాష్ట్రాల్లో తీవ్రంగా దెబ్బతీసింది. అప్పటి నుంచీ ఆ ప్రాంతంలో కాంగ్రెస్ పెద్దగా కోలుకోలేదు. అందుకే

# వ్యూహాత్మకంగా బిజెపి ఎత్తులు

మొదటిపేజీ తరువాయి

పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే సర్కారుకు షాకిచ్చిన మహారాష్ట్ర ఆరు నెలలు తిరగక ముందే మళ్లీ అక్కున చేర్చుకుంది. అక్కడ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కూటమి బలంగా పుంజుకొంది. విజయమే పరమావధిగా 'మహాయుతి' ప్రదర్శించిన శక్తి'యుక్తు'లు కూటమికి విజయాన్ని కట్టబెట్టాయి. మహాయుతిలో ఓట్ల బదలాయింపు సజావుగా సాగినట్లు ఫలితాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు మహావికాస్ అఘాడీలో సీట్ల సర్దుబాటు వేళ తలెత్తిన విభేదాలు ఎన్నికలపై ప్రతికూల ప్రభావం చూపాయి. కాంగ్రెస్ నిర్ణయాలకు దిల్లీ అనుమతులుండాలంటూ సంజయ్ రౌత్ విమర్శించడం, దీనికి హస్తం నేత నానా పటోలే స్పందన వంటివి ఇరు పార్టీల ఓటర్లను ఏకం కాకుండా చేశాయి. అఘాడీ కూటమిని నష్టపర్చాయి. ముఖ్యంగా మహిళ, ఓబీసీ, రైతుల అండతో బిజెపి కూటమి అధికారాన్ని నిలుపుకొంది. లోక్‌సభ ఎన్నికల్లో వ్యతిరేకతను అధిగమించి మరోసారి అధికారం చేపట్టబోతోంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా నేతృత్వంలోని మహాయుతి సర్కారు పట్టు నిలుపుకొంది. 2019 నుంచి ముగ్గురు ముఖ్యమంత్రులు, నలుగురు డిప్యూటీ సీఎంలను చూసిన ఈ రాష్ట్ర ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. ఓబీసీ ఓట్ల సమీకరణ, ఆకర్షణీయమైన పథకాలు, మహిళల ఓట్లు విజయంలో కీలక భూమిక పోషించాయి. భాజపా, శివసేన శిందే, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ.. ఇలా మూడు పార్టీలు మెరుగైన ప్రదర్శన చేయడం కూటమి విజయానికి దోహదం చేశాయి. ఈసారి ప్రధాన పార్టీలైన భాజపా–కాంగ్రెస్ 76 సీట్లలో ముఖాముఖి తలపడ్డాయి. గత కొన్నేళ్లుగా పలుచోట్ల జరిగిన ఇలాంటి పోరులో హస్తం పార్టీ పక్షాన సానుకూల ఫలితాలు వచ్చిన సందర్భాలు అతి తక్కువ. ఈసారి ఫలితాలను జాగ్రత్తగా గమనిస్తే.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 44 సీట్లను గెలుచుకోగా.. ఈసారి ఆ సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఆ మేరకు భాజపాకు సీట్ల సంఖ్యలో పెరుగుదల కనిపించింది. మహారాష్ట్ర రాజకీయాల్లో 11 జిల్లాలున్న విదర్భలో విజయాన్ని అధికారానికి ద్వారంగా భావిస్తారు. ఇక్కడ 62 స్థానాలున్నాయి. కొన్నేళ్లుగా ఇక్కడ భాజపా ఆధిక్యాన్ని ప్రదర్శిస్తోంది. కానీ, 2019లో కొంత మెజార్టీ తగ్గింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడ భాజపా తీవ్రంగా దెబ్బతింది. ఫలితంగా మహావికాస్ అఘాడీ 10 మంది ఎంపీలను దక్కించుకొంది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లోనూ తమదే హవా అనుకుంది. కానీ ప్రచారం మొదలయ్యాక, ఎన్నికల దగ్గర పడ్డాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ముఖాముఖి తలపడ్డ స్థానాల్లో దాదాపు 40 సీట్లలో మహాయుతి విజయం సాధించింది. ఈ ప్రాంతం వ్యవసాయాధారితమైంది. పత్తి, సోయాబీన్ ప్రధాన పంటలు. కాంగ్రెస్ ఇక్కడి వారిని ఆకట్టుకొనేందుకు చేసిన ప్రచారం అంతగా ఫలితం చూపలేదు. సోయా రైతులకు రూ.7,000 మద్దతు ధర ఇస్తామని చెప్పినా ఫలితం రాలేదు. విదర్భ ప్రాంతంలోని నాగ్‌పుర్‌లో ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉంది. ఆ సంస్థ ప్రభావం అక్కడా, ఆ చుట్టుపక్కల ప్రాంతాలపై బలంగా పనిచేసింది. గత ఎన్నికల్లో కమలం విషయంలో ఆర్ఎస్ఎస్ కాస్త కినుక వహించిందన్న ప్రచారం జరిగింది. ఈసారి మాత్రం వారి మద్దతు మహాయుతికి బాగా లభించినట్లు చెబుతున్నారు. ఈ ఎన్నికలను అత్యధికంగా ఓబీసీ సమీకరణ ప్రభావితం చేసిన అంశంగా చూడాలి. కీలకమైన మరాఠా ఓటర్లు మహావికాస్ అఘాడీలోని కాంగ్రెస్ వైపు కొంత మొగ్గ చూపుతున్నట్లు గ్రహించిన కమల బృందం తన వ్యూహానికి పదును పెట్టింది. మరాఠా వంటి
బలమైన వర్గం కాకుండా ఉన్న ఇతరత్రా వర్గాలన్నింటినీ భాజపా ఏకీకృతం చేసింది. ముఖ్యంగా ఓబీసీ ఓట్ల పైనే ప్రధానంగా దృష్టి పెట్టింది. భాజపా ఈ రాష్ట్రంలో 90ల నుంచే వీరిని తమ వైపు ఆకర్షించడానికి యత్నాలు మొదలుపెట్టింది. ముఖ్యంగా మాలి, ధంగర్, వంజరి వర్గాలు కమలనాథులకు అండగా ఉన్నాయి. మరాఠాలకు ఓబీసీ రిజర్వేషన్లు ప్రకటిస్తే తమ వాటా తగ్గుతుందని చాలా జాతుల్లో భయాలున్నాయి. వాటిని కమలం పార్టీ ఓట్లుగా మలుచుకుంది. మరోవైపు మహావికాస్ అఘాడీ మాత్రం పూర్తిగా మరాఠా రిజర్వేషన్ల అంశంపైనే ఆధారపడింది. అధికారంలోకి వస్తే వారికి రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. చిత్రం ఏంటంటే, మరాఠా వర్గానికి ఏక్‌నాథ్ శిందే అక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నారు. 'మహాయుతి' ముఖ్య నేతగా పేరొందారు. దాంతో మహావికాస్ అఘాడీ ఆశించిన స్థాయిలో పెద్ద ఎత్తున మరాఠా ఓట్లు వాళ్లకి పడలేదు. రాష్ట్రంలోని మహిళా ఓట్లను 'లడ్కీ బెహన్ పథకం' కూడగట్టింది. రూ.1,500 నేరుగా వారి ఖాతాల్లో వేయడంతో లబ్దిదారులు 'మహాయుతి' వైపు నిలిచారు. ఈసారి ఆ మొత్తాన్ని రూ.2,100 చేస్తామని కూటమి హామీ ఇచ్చింది. కాంగ్రెస్ పోటీగా రూ.3,000 ఇస్తామని పేర్కొంది. అయినా ఓటర్లు భాజపా కూటమికే పట్టం కట్టారు. ఈ పథకం వల్ల అత్యధిక ప్రయోజనం పొందిన పుణె, థానే, నాసిక్, నాగ్‌పుర్, షోలాపుర్ జిల్లాల్లో మహిళల ఓటింగ్ పోటెత్తడం భాజపాకు బాగా కలిసొచ్చింది. మహాయుతి కూటమి రైతులకు ఇప్పటికే కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద ఇస్తున్న రూ.12,000లని రూ.15,000కు పెంచుతామని హామీ ఇచ్చింది. దీంతోపాటు కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)కు అనుబంధంగా రేట్లలో తేడాను 20శాతం వరకు కవర్ చేసేలా ధరల మద్దతు పథకాన్ని తెస్తామని హామీ ఇచ్చింది. బీద రైతులకు మేలు జరిగేలా అక్షయ అన్నయోజన స్కీమ్‌ను ప్రవేశపెడతామంది. దీనిలో బియ్యం, జొన్నలు, శనగ నూనె, ఉప్పు, పంచదార, పసుపు, ఆవాలు, కారం వంటివి ప్రతినెలా ఇస్తామని పేర్కొంది. వీటితో పాటూ నదుల మళ్లింపు చేపట్టి పొలాలకు నీరు అందిస్తామని ప్రకటించింది. ఇవన్నీ అన్నదాతలను ప్రభావితం చేశాయి. మహారాష్ట్రలో ఉల్లిని ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంటారు. ఉల్లిపై ఆంక్షలు విధించడంపై కొంతకాలంగా ఉల్లి రైతులు గుర్రుగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా కూటమిపై ఆ ప్రభావం పడింది. ముఖ్యంగా నాసిక్ ప్రాంతంలో తాము ఉల్లి రైతుల ఆగ్రహాన్ని చవిచూసినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే స్వయంగా ఓ సందర్భంలో వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఉల్లి ఎగుమతులపై ఆంక్షలు తొలగించడం గమనార్హం. కమల కూటమిపై రైతుల్లో ఉన్న అసంతృప్తిని ఈ చర్యతో చల్లార్చగలిగారు.

# ముమ్మరంగా

## కొనసాగుతోన్నకులగణన సర్వే

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతోంది.. ఈ కులగణన సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ వివరాలను సేకరిస్తున్నారు. ఈ సమగ్ర ఇంటింటి సర్వే లో మొత్తం 1,16,41,017 నివాసాలు గుర్తించగా, నిన్నటి వరకు 1,01,40,767 నివాసాలలో సర్వే పూర్తి చేసి 87.1 శాతం సాధించింది. జనగాం, ములుగు జిల్లాలలో ఇప్పటికే వంద శాతం సర్వే పూర్తయింది. మెదక్, నల్గొండ జిల్లాలో 99.9 శాతంతో పూర్తి కావొస్తుంది. మిగతా 23 జిల్లాలలో జోగులాంబ గద్వాల్, జగిత్యాల, యాదాద్రి భువనగిరి, కామారెడ్డి, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, మహబూబ్ నగర్, ఖమ్మం, నారాయణపేట, మహబూబాబాద్, ఆదిలాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వనపర్తి, సూర్యాపేట, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, నాగర్ కర్నూల్, నిర్మల్, వరంగల్, సిద్దిపేట 90 శాతం పైగా సర్వే పూర్తయింది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, హన్మకొండ జిల్లాలో కూడా 80 శాతానికి పైగా సర్వే పూర్తయింది. అదేవిధంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 75.1 శాతం సర్వే పూర్తయింది. ఇక గ్రేటర్ హైదరాబాద్ (జిహెచ్ఎంసీ) పరిధిలో కూడా సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. జిహెచ్ఎంసీ పరిధిలో 25,05,517 నివాసాలు సర్వే చేయాల్సి ఉండగా నేటివరకు 16,37,563 నివాసాలు సర్వే పూర్తిచేశారు.. ఇప్పటివరకు 65.4 శాతం పూర్తియినట్లు అధికారులు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సర్వేలో మొదటినుంచి ఎన్నో అనుమానాలు విమర్శలు ఉన్నా.. ఈ కార్యక్రమం సజావుగా సాగుతోంది. అయితే.. కొన్ని చోట్ల ప్రభుత్వ ఉద్యోగులు కాకుండా ప్రైవేటు వ్యక్తులు కుటుంబాల వివరాలు సేకరిస్తున్నారని దీనివల్ల ప్రజల సమాచారంపై భద్రత ఎక్కడుందని ప్రచారం సాగింది. మరికొన్ని చోట్ల సమగ్ర కుటుంబ సర్వేకి సంబంధించిన పత్రాలు రోడ్డుమీద పడేసిన సంఘటనలు.. మరోచోట ఎన్యుమరేటర్లు ఫిల్ చేసిన అప్లికేషన్స్ రోడ్డు మీద పడిసిన ఘటనలు, దానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టాయి.. ఏదిఏమైనప్పటికీ ప్రభుత్వం అనుకున్నట్టు ఈనెలాఖరులోపు సమగ్ర కుటుంబ సర్వే పూర్తి చేసే దిశగా ప్రభుత్వం ఓ ప్రణాళికతో ముందుకు సాగుతోంది..

# జానీ మాస్టర్ బెయిల్ రద్దు పిటిషన్‌ను కొట్టివేత

మొదటిపేజీ తరువాయి

అయితే తాజాగా ఆయన బెయిల్‌ను రద్దు చేయాలంటే సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం కొట్టేసింది. ఈ సందర్భంగా సుప్రీం పలు కీలక వ్యాఖ్యలు చేసింది..సుప్రీం కోర్ట్ ఊరటనిచ్చింది. లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ అయిన జానీ మాస్టర్‌కు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలన్న అంశంపై సుప్రీం కీలక నిర్ణయం తీసుకుంది. జానీ మాస్టర్ బెయిల్ రద్దు చేయాలన్న పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టేసింది. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేశారు.తనను లైంగికంగా వేధించారంటూ తోటి మహిళా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జానీ మాస్టర్‌ను అరెస్ట్ చేయగా ఆయన బెయిల్ మీద బయటకు వచ్చారు. 37 రోజుల పాటు జైల్లో ఉన్న జానీ మాస్టర్‌కు రంగారెడ్డి జిల్లా కోర్టు అక్టోబర్ 24వ తేదీన బెయిల్‌ను అందించారు. అయితే తాజాగా బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆ కేసులోని ఫిర్యాదుదారు దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. ఈ విషయమై జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ సతీష్‌చంద్ర మిశ్రలతో కూడిన ధర్మాసనం దాన్ని డిస్మిస్ చేసింది.

ఇదిలా ఉంటే లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న తర్వాత తొలిసారి జానీ మాస్టర్ ఇటీవల పబ్లిక్‌గా మాట్లాడారు. జబర్దస్త్ రాకేష్ నటించిన 'కేసీఆర్' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హాజరైన జానీ మాస్టర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇటీవల కొన్ని కొన్ని సంఘటనలు జరిగాయి.. ఇలా జరిగినప్పుడు బయటకు ఎవ్వరూ రారు.. నన్ను నమ్మిన ప్రతీ ఒక్కరికీ.. ఇంట్లో బిడ్డలా అనుకుని ఆశీర్వదించిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మీరు పెట్టుకున్న నమ్మకం ఎక్కడికి పోదు.. త్వరలోనే అన్నీ తెలుస్తాయ్' అని ఎమోషన్ అయ్యారు.

# రేవంత్ అసత్య ప్రచారాన్ని మరాఠా ప్రజలు నమ్మలేదు: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: దేశ భవిష్యత్‌కు ప్రాంతీయ పార్టీలే బలమైన పునాదులనే విషయం మహారాష్ట్ర, ఝార?ండ్ ఫలితాలతో తేలిపోయిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. బలమైన ప్రతిపక్షంగా కూడా నిలవలేని కాంగ్రెస్.. దేశంలో ప్రాంతీయ పార్టీలను నాశనం చేస్తోందని ఆక్షేపించారు. ఈ మేరకు భారాస సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. "కాంగ్రెస్ చేతగానీ, అసమర్థత కారణంగానే భాజపా మనుగడ కొనసాగుతోంది. ప్రాంతీయ పార్టీల కృషిని విస్మరిస్తూ జాతీయ పార్టీలైన కాంగ్రెస్, భాజపాలు సిగ్గు లేకుండా విమర్శలు చేస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం ఘోర ఓటమి నుంచి కాంగ్రెస్‌ను కాపాడలేకపోయింది. ఆయన అసత్య ప్రచారాన్ని మరాఠా ప్రజలు నమ్మలేదు. ఇకనైనా తెలంగాణలో గెలిపించిన ప్రజల కోసం, వాళ్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చటం కోసం రేవంత్ పనిచేయాలి. ఏడాది క్రితం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుపై దృష్టి పెట్టాలి. ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలనే కుట్రలో కాంగ్రెస్ ఎక్కువ కాదు.. భాజపా తక్కువ కాదు"అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ప్రజలంతా ప్రధాని మోడీ వెంటే



మొదటిపేజీ తరువాయి

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార 'మహాయుతి'కూటమి అద్భుత విజయం సాధించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను సైతం అందని రీతిలో సీట్లు సాధించి సునామీ సృష్టించింది. ఈ అఖండ విజయంపై భాజపా సీనియర్ నేత, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. ప్రజలంతా నరేంద్ర మోదీ వెంటే నిలిచారనడానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఇలాంటి భారీ విజయం సాధించడంలో సహకరించిన మహిళలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనేక తప్పుడు ఆరోపణలు, బూటకపు కథనాలను ప్రచారం చేయడం, మతం ఆధారంగా ఓటర్లను వేరు చేయడం వంటి విపక్ష పార్టీల ప్రయత్నాలను జనం విఫలం చేశారన్నారు. తమ కూటమి
విజయంపై ముంబయిలో విలేకర్లతో మాట్లాడారు. మహారాష్ట్ర ఓటర్లు, పార్టీ శ్రేణులు, నేతల మద్దతు వల్లే విపక్షాల 'చక్రవ్యూహం'ను విచ్ఛిన్నం చేయడంలో తాను విజయవంతమయ్యానన్నారు. ముఖ్యమంత్రి పదవి విషయంలో ఎలాంటి వివాదం లేదని.. తదుపరి సీఎం ఎవరనే విషయంపై 'మహాయుతి' నేతలు నిర్ణయిస్తారని ఫడణవీస్ స్పష్టం చేశారు. సీఎం ఏక్‌నాథ్ శిందే సారథ్యంలోని పార్టీనే బాలాసాహెబ్ ఠాక్రే నిజమైన శివసేన అని ప్రజలే చూపించారన్నారు. ఇది భాజపా విజయమన్న ఫడణవీస్.. ఇందులో తన పాత్ర చాలా చిన్నదేనని వ్యాఖ్యానించారు.

# హైదరాబాద్‌లో డిసెంబర్ 8 నుంచి 'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ ర్యాలీ

మొదటిపేజీ తరువాయి



హైదరాబాద్: డిసెంబర్ 8 నుంచి 16 వరకు హైదరాబాద్‌లో 'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనుంది. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో నియామక ర్యాలీ ఉంటుందని ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులు తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్ / స్టోర్ కీపర్ ట్రెడ్స్‌కు పదో తరగతి అర్హతగా ఉండాలని పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి నుంచి మహిళా మిలిటరీ పోలీస్ అభ్యర్థులకు ఫిబ్రవరి 12, 2024 నాటి ర్యాలీ నోటిఫికేషన్ ప్రకారం ర్యాలీ జరిగే చోటుకి అన్ని డాక్యుమెంట్లను తీసుకురావాలని బోర్డు సూచించింది. రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉంటుందని అధికారులు వివరించారు.

# మహారాష్ట్ర jarkand రాష్ట్రాలు ఎవరిది వారికే ఎవరు గెలిచినా ఓడినా మోడీ ఒక్కడే విజేత

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్.**




6 నెలల్లో ఎన్నికల గాలిని బిజెపి వైపు మళ్ళించి మోడీ అసలు విజేతగా నిలిచాడు.2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఎదురైన ప్రతికూలతను హర్యానా,మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల విజయాలతో బిజెపికి అనుకూలంగా మార్చిన మోడి.మహారాష్ట్ర,jarkand రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాల అసెంబ్లీల్లో ఖాళీగా ఉన్న శాసన సభ స్థానాలకు కూడా ఉప ఎన్నికలు జరిగాయి.వీటిలో అస్సాంలోని 5 స్థానాలు, బీహార్ – 4, ఛత్తీస్‌గఢ్ – 1, గుజరాత్ – 1, కర్ణాటక – 3, కేరళ – 2, మధ్యప్రదేశ్ 2, మేఘాలయ 1, పంజాబ్ – 4, రాజస్థాన్ – 7, సిక్కిం – 2, ఉత్తరప్రదేశ్ – 9, ఉత్తరాఖండ్ – 1, పశ్చిమ బెంగాల్ నుంచి 6 స్థానాలు ఉన్నాయి. కేరళ, వయనాడ్ పార్లమెంట్ ఉప ఎన్నిక కూడా జరిగింది మహారాష్ట్రలో నిన్నటి వరకు అధికారంలో ఉన్న బిజెపి నాయకత్వంలోని మహాయుతి కూటమి తన పట్టు నిలుపుకుని,మరింత మెరుగు ఫలితాలు సాధించింది. jarkand రాష్ట్రంలో జెఎంఎం నాయకత్వంలోని ఇండి కూటమి మళ్ళీ అధికార పగ్గాలు దక్కించుకున్నాయి.కాకపోతే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో మహారాష్ట్రలో విజయ ఢంకా మ్రోగించిన ఇండి కూటమిని కట్టడి చేసి నిలువరించి బిజెపి కూటమి మళ్ళీ గెలిచి నిలుచున్నది. ఈ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు అన్ని పార్టీల అసలు స్థితిని పట్టి చూపాయి.గత 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 105 సీట్లు గెలిచిన బిజెపి ఈసారి 133 సీట్లు గెలుచుకుని తన స్థానాన్ని మెరుగు పరచుకున్నది. బిజెపి పొత్తుతో అప్పుడు 56 సీట్లు గెలుచుకున్న ఉద్ధవ్ థాక్రే శివసేన ఈ ఎన్నికల్లో దెబ్బతిన్నది.2019 లో ప్రజాతీర్పును కాదని అత్యాశకు పోయి శివసేన పార్టీ చీలికకు కారణమైన ఉద్ధవ్ థాక్రే పై తిరుగుపాటు చేసి పార్టీని అధికారాన్ని హస్తగతం చేసుకున్న ఏక్ నాథ్ షిండే నాయకత్వంలోని శివసేన అసలు శివసేన పార్టీగా నిరూపించుకున్నది. రాజకీయ చాణక్యుడిగా పేరున్న శరద్ పవార్ 2019 ఎన్నికల ప్రజాతీర్పును దెబ్బతీసి కాంగ్రెస్, ఉద్ధవ్ ను కలుపుకుని సింగిల్ లార్జెస్ట్ పార్టీ బిజెపిని దెబ్బతీయాలనుకుని ఈ ఎన్నికల్లో తానే స్వయంగా దెబ్బతిన్నాడు.2019 లో 54 సీట్లు గెలుచుకున్న ఎన్సీపీ శరద్ పవార్ పార్టీ చీలిపోయి అజిత్ పవార్ నాయకత్వంలో ఎన్సిపి బీజేపీతో చేతులు కలిపింది. 019 లో శరద్ పవార్ ఎన్సిపి 54 సీట్లు గెలుచుకుంటే, ఈ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 10 సీట్లు మాత్రమే సాధించింది.మహారాష్ట్రలో ఇక శరద్ పవార్ శకం ముగిసినట్లేనని అనిపిస్తున్నది.ఇక 2019లో 44 సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్ ఇప్పుడు 15 సీట్లకే పరిమితమయింది.బిజెపిని దెబ్బతీయాలని కూటమిగా ఏర్పడ్డ ఉద్ధవ్,శరద్ పవార్,కాంగ్రెస్ లు ప్రజలచే తిరస్కరించ బడ్డారన్నది నిజం.2019లో బిజెపి కూటమికి ప్రజలిచ్చిన ఆమోదాన్ని దెబ్బతీసిన కాంగ్రెస్ కూటమికి ప్రజలు ఇప్పుడు తగిన బుద్ధి చెప్పారు.2019 లో మొత్తం 154 సీట్లలో గెలిచిన మూడు పార్టీలు శివసేన, ఎన్సిపి కాంగ్రెస్ లు ఈ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 49 సీట్లకే పరిమితమయ్యారు.మహారాష్ట్రలో ప్రజల సానుభూతి పొందిన బిజెపి కూటమికి అధికారం అప్పగించిన ప్రజలు, jarkand లో హేమంత్ సోరేన్ నాయకత్వంలోని జె ఎం ఎం కూటమికి మళ్ళీ అధికార పగ్గాలు అప్పగించారు.2019 అసెంబ్లీ ఎన్నికల్లో యు.పి.యే కూటమిగా పోటీచేసిన పార్టీలు అప్పుడు 47 సీట్లు సాధిస్తే, ఇప్పుడు ఈ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో jarkand లో జె,ఎం,ఎం కూటమిగా పోటీచేసిన పార్టీలు 56 సీట్లు సాధించాయి.jarkand లో శిబూ సోరేన్ అసలైన వారసుడు హేమంత్ సోరేన్ అని ప్రజలు నమ్మారన్నది స్పష్టం.అవినీతి కేసుల్లో జైలుకు పోయి వచ్చిన సోరేన్ పై ప్రజలు సానుభూతి కురిపించారని పరిశీలకుల అభిప్రాయం.రాజకీయ అవినీతికి ప్రజలు కూడా అలవాటు పడ్డట్టే అనిపిస్తున్నది. హేమంత్ సోరేన్ ఈడి కేసుల్లో జైలుకు పోయినా,ప్రజలు ఇదేమీ పట్టించుకోలేదనిపిస్తున్నది.ఇక వివిధ రాష్ట్రాల్లో అధికారం లో ఉన్న పార్టీలు లేదా కూటములకే ఉప ఎన్నికల ఫలితాలు అనుకూలంగా వచ్చాయి.కేరలోని అసెంబ్లీ ఉపఎన్నికల్లో వామపక్ష కూటమి తన పట్టు నిలుపుకుంటే, వయనాడ్ పార్లమెంట్ సీటును మళ్ళీ కాంగ్రెస్ నిలుపుకున్నది. రాహుల్ గాంధీ కంటే ప్రియాంక గాంధీకి అధిక ఓట్లు,అధిక మెజారిటీ రావడం విశేషమే. కాకపోతే కేరళ వయనాడ్ పార్లమెంట్ సీటులో బిజెపి లక్షా ఇరువది వేల ఓట్లు సాధించడం కూడా విశేషమే. పార్లమెంట్ ఎన్నికల ఊపును కోల్పోయిన ప్రతిపక్షాలు 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి కి స్వంత మెజారిటీ రాకుండా చేసిన బిజెపి వైరి పక్షాలు 6 నెలల్లోనే తిరోగమనం చెందాయి.ఉత్తర్ ప్రదేశ్ లో యోగి నాయకత్వంలోని బిజెపి మళ్ళీ తన హవాను నెలకొల్పింది. 9 స్థానాల్లో 7 సీట్లు సాధించిన బిజెపి ఎస్పీ పార్టీకి మళ్ళీ చమటలు పట్టించింది.2024 పార్లమెంట్ ఎన్నికలు కనిపించని ప్రభావాలతో,ఎన్నికల ఎత్తుగడలతో సాగింది. బిజెపి కి స్వంత మెజారిటీ రాకున్నా నిరాశ చెందకుండా వ్యూహ ప్రతివ్యూహాలతో బిజెపి హర్యానా,మహారాష్ట్ర విజయాలతో మళ్ళీ తన పట్టును నిలుపుకున్నది.మోడీ చరిష్మా తగ్గలేదని, మోడీ నిష్కల్మష పనితీరు ప్రజల్లో అభిమానం తగ్గలేదని ఈ ఎన్నికలు నిరూపించాయి.జాతీయ అంతర్జాతీయ కుట్రలతో నడిచే ఈ రాజకీయ చదరంగంలో బిజెపి నేర్పుతో ఆటను కొనసాగిస్తున్నది.ఉచిత పథకాలు, తాయిలాలు కాదని పామరులు కూడా దేశ ప్రయోజనాలు ముఖ్యమని భావిస్తున్నారు.ఎవరు గెలిచినా ఓడినా మోడీ ఒక్కడే విజేత అని భారత్ ఎన్నికల పోరాటాలు నిరూపిస్తున్నాయి.

## 13వ వార్డు ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కు ఘనంగా సన్మానం.



**కరుణాకర్ ప్రతినిధి, మెట్ పల్లి, నవంబర్ 23.**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి 13వ వార్డు బాలకృష్ణ నగర్ కాలనీ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇటీవల నూతనంగా నియమితులైన మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ ను మర్యాదపూర్వకంగా కాలనీలో ఘనంగా సన్మానం చేశారు. అలాగే కాలనీకి మొదటిసారి వచ్చిన రాష్ట్ర నాయకులు సాంబారి ప్రభాకర్ మర్యాదపూర్వకంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు తోట ప్రవీణ్, ఉపాధ్యక్షులు సాంబార్ శ్రీనివాస్, కార్యదర్శి రమేష్ ,తోట ప్రసాద్, చిన్ని రమేష్, చొప్పరి శ్రీనివాస్, శ్రీకాంత్ ,నవీన్ ,రాజు ,మహేష్, తదితరులు పాల్గొన్నారు

## నిరుపేద కుటుంబానికి గళం యూట్యూబ్ , మ్యూజిక్ వారి చేయూత

**– వివాహ వేడుకకు 5016 ఆర్థిక సహాయం**

**కరుణాకర్ ఎండపల్లి నవంబర్ 23,**



మండలంలోని కొండాపూర్ గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన నేరెళ్ళ తిరుపతి చెల్లెలు రాధా వివాహం జరిగింది, ఈ సందర్భంగా నిరుపేద కుటుంబం కావడంతో , వెనంక శ్రీనివాస్ గళం మ్యూజిక్ యూట్యూబ్, ఛానల్ వారీ పరిస్థితిని అర్థం చేసుకొని వారి తరపున, వదూ వరులకు ,పుస్తెమట్టెలు కొరకు 5016 రూపాయలు ఆర్థిక సహాయం చేసి ఆ కుటుంబానికి చేయూతనిచ్చారు ,ఈ కార్యక్రమంలో తోడేటి రాజు, సామల సంతోష్ కుమార్,ముద్దం శేఖర్, జుంజిపల్లి చంద్రమౌళి, సింగతి వెంకటస్వామి పాల్గొన్నారు,

## నేడు జరగబోయే యాదవ వన సమారాధనను జయప్రదం చేయండి. మెండే వెంకటేష్ యాదవ్

**కరుణాకర్ న్యూస్ : ఖమ్మం నవంబర్ 23:**

ఆదివారం రోజున యాదవుల మహాసమారాధన కార్యక్రమం ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహా సభ డిసిసిబి డైరెక్టర్ మల్లి బాబు యాదవ్ ఆధ్వర్యంలో ఖమ్మం చెరుకూరి గార్డెన్స్ లో జరుగుతుంది కావున ఈ యొక్క కార్యక్రమంలో జిల్లాలోని ప్రతి యాదవ కుటుంబం పాల్గొని జయప్రదం చేయవలసిందిగా... కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు మెండే వెంకటేష్ యాదవ్ పిలుపునిచ్చారు. యొక్క మన సమారాధనలో ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ప్రభుత్వ బీర్ల ఐలయ్య, రుమ జాతీయ కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్,తదితర ముఖ్యులు పాల్గొంటున్నారని తెలియజేశారు. కావున ఖమ్మం జిల్లాలోని ప్రతి ఒక్క యాదవ సోదరులు అందరూ కలిసి ఈ యొక్క వన సమారాధనకు విచ్చేసి మన యాదవ కులాన్ని ప్రతిష్ట చేయవలసిందిగా వారు కోరారు.

## కోరుట్లలో బిజెపి శ్రేణుల సంబరాలు

**కరపత్రం ప్రతినిధి కోరుట్ల నియోజక వర్గం**



మహారాష్ట్ర ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో కోరుట్ల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణ కార్గిల్ చౌరస్తాలో కోరుట్ల భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.రాజకీయాల్లో నీతిని, సేవను,దేశభక్తిని కలిపి నిరంతర శ్రమతో పాలన చేస్తున్న మోదీకి, బిజెపికి మహారాష్ట్ర ప్రజలు అందించిన విజయమని బిజెపి నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఇందూరి తిరుమల వాసు, బింగి వెంకటేష్, సుదవేని మహేష్, చిరుమల్ల ధనుంజయ్, మాసం ప్రసాద్, పోతుగంటి శ్రీనివాస్, కల్లాల చందు తో కార్యకర్తలు పాల్గొన్నారని, బిజెపి కార్యకర్తలు మహారాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలియజేసారని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆకుల రంజిత్ అన్నారు

## డ్రైవింగ్ రాని వ్యక్తి స్కూల్ బస్ యాక్సిడెంట్

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి మేడ్చల్**




మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో స్కూల్ బస్సు ప్రమాదానికి గురైంది."డివైన్ గ్రేస్ ఇంటర్నేషనల్ స్కూల్" బస్సు కుందనపల్లి చౌరస్తాలో చెట్టును ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో చిన్నారులకు గాయాలయ్యాయి.డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.ప్రమాద సమయంలో బస్సులో 40 మంది చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది.బస్సు అదుపు తప్పి తొలుత కరెంటు స్థంభాన్ని ఢీకొట్టింది. అనంతరం చెట్టును ఢీకొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు.డ్రైవింగ్ తెలియని వ్యక్తికి బస్సు అప్పగించడమే కారణమని విద్యార్థుల తల్లి దండ్రులు ఆరోపిస్తున్నారు.ప్రమాదానికి కారణమైన వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నట్టు కీసర పోలీసు అధికారులన్నారు.

## 75 ఏళ్ల రాజ్యాంగ దినోత్సవ ఉత్సవానికి తరలిరండి

**– డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్**

**కరుణాకం నిజాంపేట్ ప్రతినిది....**



నేడే 24న ఆదివారం నాడు మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ అవుట్ డోర్ ఆడిటోరియంలో 75 ఏళ్ల రాజ్యాంగ దినోత్సవ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్ )జాతీయ కార్యదర్శి పి శంకర్ తెలిపారు. శనివారంనాడు నిజాంపేట మండల కేంద్రం లో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పి.శంకర్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగానికి 75 ఏళ్లు నిండిన సందర్భంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తరతరాలుగా కుల వ్యవస్థ మూలంగా విద్యకు, ఉపాధికి సామాజిక ,ఆర్థిక, రాజకీయ రంగాలకు దూరంగా నెట్టివేయబడి బానిసలుగా జీవిస్తున్న కోట్లాదిమంది అనగారిన వర్గాల జీవితాలలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగం వెలుగులు నింపిందని తెలిపారు .ఆదివారం నాడు మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే రాజ్యాంగ దినోత్సవ ఉత్సవ సభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరవుతున్నారని తెలిపారు. అదేవిధంగా హైకోర్టు న్యాయవాది పొన్నం దేవరాజ్ గౌడ్ బహుజన నాయకులు రాచకొండ వెంకన్న ,మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ తదితరులు హాజరవుతారని తెలిపారు. రాజ్యాంగ పలాలు పొందిన ప్రతి ఒక్కరూ ఈ రాజ్యాంగ ఉత్సవానికి తదితరులు తరలి రావాలని కొరారు.ఈ కార్యక్రమం లో సీనియర్ దళిత నేత కొనపూర్ సాగర్,డిబిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్, వివిధ సంఘాల నాయకులు కొమ్మాట బాబు, బత్తులరాజన్న, రాగుల బాబు బండారి ఎల్లం తదితరులు పాల్గొన్నారు

# సినిమాల్లోనే కాదు..
# రాజకీయాల్లోనూ పవర్‌స్టారే



పవన్ కల్యాణ్‌పై సినీ నటుడు నాని ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పవన్‌కు మద్దతుగా నిలిచిన హీరోల్లో నాని ఒకరు. ఆయనకు మద్దతుగా పోస్ట్ పెట్టి తన అభిమానాన్ని చాటుకున్నారు. తాజాగా పవన్ గురించి నాని మరోసారి మాట్లాడారు. రానా దగ్గుబాటి షోలో పాల్గొన్న ఆయన పవన్ రాజకీయాల్లోనూ పవర్ స్టారే అని అన్నారు.'సినిమాల్లో పవన్ కల్యాణ్ స్టార్‌గా ఎలా ఎదిగారో తెలిసిందే. అయితే రాజకీయాల్లోనూ ఆయన అదే స్థాయిలో ఎదిగారు. అక్కడ కూడా పవర్‌స్టార్ అని నిరూపించుకున్నారు. ఎంతోమందికి స్ఫూర్తినిచ్చారు' అని నాని అన్నారు. ఈ కామెంట్స్‌పై రానా స్పందిస్తూ.. పవన్ చాలా కష్టపడి ఈ స్థాయికి వచ్చారన్నారు. ఆయన నిజంగానే సూపర్ స్టార్ అని చెప్పారు. రాజకీయాలు కూడా సినిమాల్లాగే ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో నానితో పాటు ప్రియాంక అరుల్ మోహన్ కూడా పాల్గొన్నారు. రానా అడిగిన ప్రశ్నలకు వీరిద్దరూ ఆసక్తికర సమాధానాలు చెప్పారు. ఈ షో తొలి ఎపిసోడ్‌ను గోవాలో జరుగుతోన్న 55వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫ్ఫీ)లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా 'ది రానా దగ్గుబాటి షో' పేరుతో ఓ టాక్ షో ప్రసారం కానుంది.ఇక ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఓవైపు రాజకీయాల్లో బిజీగా ఉంటూనే సినిమాలు కూడా పూర్తి చేస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్‌గా సుజీత్ దర్శకత్వంలో 'ఓజీ' తెరకెక్కుతుంది. దీనితో పాటు 'హరి హర వీరమల్లు', 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రాలు కూడా సిద్ధమవుతున్నాయి. ఇటీవలే 'హరి హర వీరమల్లు' షూటింగ్‌ను పునః ప్రారంభించారు.

# ఎందరో హేళన చేసినా
## తనేంటో నిరూపించుకున్నారు నాన్న



**గోవాలో** ఘనంగా జరుగుతున్న ఇఫీ వేడుకల్లో ప్రముఖ దివంగత నటుడు ఏఎన్నార్‌కు నివాళు లర్పించారు నాగార్జున. ఈ సందర్భంగా శుక్రవారం 'సెంటినరీ స్పెషల్ ఏఎన్నార్: సెలబ్రేటింగ్ ది లైఫ్ అండ్ వర్క్స్ ఆఫ్ అక్కినేని నాగేశ్వరరావు' పేరుతో ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఏఎన్నార్ సాధించిన విజయాలు, ఘనత గురించి ఆ వేదికపై మాట్లాడారు నాగార్జున . "ఒక రైతు కుటుంబం నుంచి వచ్చిన గొప్ప వ్యక్తి ఏఎన్నార్. మా నానమ్మకు ఆడపిల్లలంటే చాలా ఇష్టం. అందుకే మా నాన్నను చిన్నప్పుడు అమ్మాయిలా తయారు చేసి మురిసిపోయేది. ఇదే ఆయనకు నటనలో గుర్తింపు తెచ్చుకోవడానికి సహాయపడింది. ఆరోజుల్లో సినిమాల్లో నటించే అమ్మాయిలు అరుదుగా ఉండేవారు. అందుకే అప్పట్లో ఎక్కువగా స్త్రీ పాత్రలు పోషించేవారు. దీని వల్ల చాలా మంది ఆయన్ని హేళన చేశారు. ఈ విమర్శల వల్ల ఏఎన్నార్ ఆత్మహత్య కూడా చేసుకోవాలనుకున్న సందర్భాలున్నాయి. అయినా వాటన్నింటినీ అధిగమించి తనేంటో నిరూపించుకోవాలని ఎంతో కష్టపడ్డారు. ఎన్నో సవాల్ విసిరే పాత్రల్ని పోషించి మంచి గుర్తింపు తెచ్చుకున్నార"ని చెప్పారు.

'పుష్ప 2'లో ఆ సాంకేతికత సినిమా, థియేటర్ టెక్నాలజీ లాంటి విషయాలపై నాగార్జున మాట్లాడారు. "మనదేశంలో డాల్బీ విజన్ సాంకేతికతను అన్నపూర్ణ స్టూడియోలో ఏర్పాటు చేశాం. ఇదే టెక్నాలజీతో 'ఆర్‌ఆర్‌ఆర్'ను రూపొందించాలనుకున్నారు రాజమౌళి. కానీ మనదేశంలో ఆ సదుపాయాలు లేకపోవడంతో జర్మనీ వెళ్లి ఆ పనుల్ని పూర్తిచేశారు. ఇప్పుడు ఆ టెక్నాలజీని అన్నపూర్ణ స్టూడియోలో అందుబాటులోకి తీసుకొచ్చాం. 'పుష్ప 2'లో దాన్ని వినియోగిస్తున్నందుకు ఆనందగా ఉంద"ని చెప్పుకొచ్చారు. వచ్చే నెల 4న జరగనున్న నాగచైతన్య, శోభితాల పెళ్లి పనులు వేగంగా జరుగుతున్నట్లు, అతికొద్దిమంది సన్నిహితుల సమక్షంలో సంప్రదాయరీతిలో వివాహానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు నాగార్జున.



# 'వార్ 2'పై ప్రత్యేక శ్రద్ధ?

'స్త్రీ 2'లో ప్రేక్షకుల్ని భయపెడుతూ సీటు అంచున కూర్చోబెట్టిన అందాల తార శ్రద్ధా కపూర్.. ఇప్పుడు 'వార్ 2'లో స్టెప్పులు వేయడానికి సన్నద్ధమవుతుందా? అంటే అవుననే అంటున్నాయి చిత్రవర్గాలు. అగ్రకథానాయకుడు ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. కియారా అద్వాణీ కథానాయిక. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌ను అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో శ్రద్ధ ఓ ప్రత్యేక గీతంలో ఆడిపాడనున్నట్లు తెలుస్తోంది. ఈ పాటలో ఆమె.. ఎన్టీఆర్, హృతిక్‌తో కలిసి వేసే స్టెప్పులు సినీప్రియుల్ని ఉర్రూతలూగించేలా ఉంటాయని, త్వరలో ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు శ్రద్ధ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# అలాంటి పాత్రలు ఎంచుకున్నందుకు విమర్శించారు
## - నిత్యా మేనన్



గోవాలో [illegible] అంతర్జాతీయ సినిమా పండుగ (ఇఫ్ఫీ) వేడుకగా జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ వేడుకలో నటి నిత్యా మేనన్ పాల్గొని సినిమాల్లోని పాత్రల ఎంపిక గురించి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. కొన్ని పాత్రలను ఎంపిక చేసుకున్నప్పుడు ఎదురయ్యే సవాళ్ల గురించి చర్చించారు.'ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో తేలికపాటి పాత్రలను ఎంచుకున్నందుకు విమర్శించారు. ఆ తర్వాత కథలను ఎంపిక చేసుకునే విధానాన్ని మార్చుకున్నా. నటన అనేది భావోద్వేగానికి సంబంధించింది. దానికి వ్యక్తిగత అనుభవం అవసరం లేదు. సినిమాలో తల్లి పాత్ర పోషించడానికి అనుభవం అవసరం లేదు. దానిలో ఉండే భావోద్వేగాన్ని తెరపై చూపగలిగితే చాలు. మనం చేసే పాత్రలపై మనకు పూర్తి విశ్వాసం ఉండాలి. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే వాటిని ఎంచుకుంటే గుర్తింపు లభిస్తుంది. మనసు ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి. లేదంటే ఆ ప్రభావం మనం పోషించే పాత్రపై పడుతుంది. గతంలో నేను ఎప్పుడూ విచారంగా ఉండేదాన్ని. ఏడ్చే సన్నివేశాల్లో సులభంగా నటించేదాన్ని. ఎమోషనల్ సీన్‌లు తేలికగా చేసేదాన్ని. ఇప్పుడు అలాంటి సన్నివేశాలు చేయడం కొంచెం కష్టంగా మారింది. బహుశా నేనిప్పుడు చాలా ఆనందంగా ఉంటున్నానేమో' అని నిత్యా మేనన్ చెప్పారు ఇటీవల జరిగిన 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ నటిగా నిత్యా పురస్కారాన్ని అందుకున్నారు. ధనుష్ హీరోగా నటించిన 'తిరు'(తిరుచిత్రంబళం)కు గాను ఆమె ఈ అవార్డును అందుకున్నారు. ప్రస్తుతం ఆమె పాండిరాజ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతితో కలిసి ఓ సినిమా చేస్తున్నారు. అలాగే 'గోల్డెన్ వీసా'లోనూ నటిస్తున్నారు. దీనితో పాటు ధనుష్ సరసన 'ఇడ్లీకడై'లో చేస్తున్నారు . ధనుష్ స్వీయ దర్శకత్వంలో.. గ్రామీణ నేపథ్య కథతో ఇది రూపొందుతోంది.